


'ఒరేయ్ సుజాతని చూసి బలే మోసపోయామురా' గదిలోంచి రవి కంఠం ఖంగ్గున విన్పించింది.

ఆ మాటలకి లోపలికి రాబోయిన భాస్కర్ బయటే ఆగిపోయాడు.

# సుజాత

విన్నకోట సుశీలాదేవి



"ఎప్పుడూ పైపై అందం చూడకూడదురా. చూస్తే ఇలాగే జరుగుతుంది" శేఖర్ అంటున్నాడు.

సుజాత. భాస్కర్ వివాహం చేసుకోవాలనుకున్నారు. అందరికీ తెలుసు. ఎంగేజ్‌మెంటు కూడా అయింది. ఆమె యెంతో మంచిదనుకుని తన అదృష్టానికి పొంగిపోయాడు యిన్నాళ్ళూ. ఆమెని గూర్చి తన ఫ్రెండ్స్ యిలా కామెంట్స్ చేస్తోంటే వినలేకపోయాడు.

"తిరుగుతోందా" రవిగొంతు అది.

"ఏం తిరగడంరా నాయనా, ఉత్త చెత్త రకం. ఇక దాన్నిగూర్చి చెప్పకు" శేఖర్ అంటున్నాడు.

"ఎంతో బాగుందని భాస్కర్‌కి చెప్పి ఒప్పించాం ఇప్పుడెలా,"

"భాస్కర్ 'కూడా చాలా మోజుపడుతున్నాడురా."

"భాస్కర్‌కి నిజం చెప్దాం"

"నిజమా!"

"అవునురా! ఫ్రెండ్‌ని మోసం చేయకూడదురా."

"కాని ఎలా చెప్పేదిరా?"

"నోటితో."

"నోటితోనని నాకు తెలుసులేవోయ్. అదేదో నువ్వే చెప్పు".

నువ్వే చెప్పు నేను నీ పక్కన ఉండి బలపరుస్తా."

"ఏడిశావులే. మొన్న ఎంత డబ్బు ఖర్చు చేశాడురా. ఇలా చెప్పగానే ఎంత బాధపడతాడో"

"అందుకనే నేను చెప్పలేనసేది."

"నేనూ చెప్పలేనురా."

స్నేహితులకి తనమీద వున్న ప్రేమకి జోహార్లర్పించాడు భాస్కర్. వెనుదిరిగి పోస్టాఫీసుకి వెళ్ళి తండ్రికి ఉత్తరం వ్రాశాడు. సుజాతతో తన మారేజ్ క్యాన్సిల్ చెయ్యమని. కారణాలు. తర్వాత చెప్తానని తిరిగి రూముకొచ్చేసరికి ఫ్రెండిద్దరూ పేకాట ఆడుకుంటున్నారు. భాస్కర్‌ను చూడగానే.

"రా!రా! ఎక్కడికి పోయావ్" రవి అన్నాడు.

"నీకూ పేక ముక్కలు వేయమంటావా శేఖర్ అడిగాడు.

"ఆడాలని లేదురా" భాస్కర్ చిరాగ్గా ముఖం పెట్టాడు.

"ఫర్వాలేదులేరా" రవి ముక్కలు వేశాడు. యాంత్రికంగా ముక్కలు అందుకున్నాడు భాస్కర్. ఆడుతున్నాడన్న మాటేగాని మనస్సు సుజాతగూర్చి ఆలోచిస్తోంది. సుజాత ఎంత అందమైనది. ఈ పెళ్ళి జరగాలని ఎందరి దేవుళ్ళనో ప్రార్థించాడు. చివరికి ఇలా జరిగింది. ప్చ్.... ఏం చేస్తాం ప్రాప్తం లేదు. బాధగా నిట్టూర్చాడు.

"ఏరా మనసు ఎక్క*ంది సుజాత గారి దగ్గరికెళ్ళిందా!" రవి ఎగతాళి చేశాడు.

భాస్కర్ కోపంగా చూశాడు.

"సుజాత!" అని పళ్ళు కొరుకుతూ "ఆ పేరెత్తకు. . ఇప్పుడే మా నాన్నకు ఉత్తరం వ్రాశా. ఈ మారేజ్ క్యాన్సిల్ చేయమని" - అన్నాడు.

ఫ్రెండిద్దరూ తెల్లబోయారు.

"ఏం! ఏం జరిగింది!"— ఇద్దరూ ఒకేసారి అరిచారు.

"ఒరేయ్ ఎంత ఫ్రెండ్సయినా ఇంత మంచితనం పనికిరాదురా! నేను బాధపడతానని అసలు విషయం నాతో చెప్పడం మానేశారు. ఇప్పటి బాధకంటె జీవితం ముఖ్యంరా. మీరు చెప్పలేని మాటలు నేను విన్నాను"- అన్నాడు భాస్కర్.

"ఏవిటీ! విన్నది" రవి అడిగాడు,

"అదేరా యిందాక మీరు సుజాత మంచిదికాదు అనుకుంటున్నారుగా" సూటిగా అడిగాడు భాస్కర్.

"సుజాతా!" ఆశ్చర్యంగా చూశాడు శేఖర్. తమ మాటలు జ్ఞాపకం చేసుకుని "ఓ అదా"అని ఫక్కున నవ్వాడు మళ్ళా.

"సుజాతఅంటే అమ్మాయి కాదురా ఫూల్. వాచిరా! నీకు యెల్లుండి పోస్టులో రాబోతున్న వాచిరా దద్దమ్మా."

రవి అందుకున్నాడు "నిన్న ప్రసాద్ కనిపించాడురా. అటువంటి వాచి వాళ్ళ సిస్టర్ కుందిట.ఏం పని చేయటంలేదుట. నువ్వు సుజాతగారికి, సుజాత అనే వాచీని ప్రజెంట్ చేద్దామనుకుంటున్నావుగా, తీరా పనికిరానిదిస్తే ఆవిడకి కోపం వస్తుంది. మరి వాచీ బెంగుళూరునుంచి సగందూరం వచ్చేసింది. మాకు ఏం చెయ్యాలో తోచక" ఆపేశాడు రవి. ఆ మాటలు విని అదిరిపడ్డాడు భాస్కర్.

'మైగాడ్ యెంతపని జరిగింది' అంటూ వాళ్ళిద్దరి వైపు చూసి "ఓరి వెధవల్లారా ముందే ఎందుకు చెప్పలా" అని జుట్టు పీక్కున్నాడు బాధగా.

"ఏమైందిరా."

"ఇంకా యేమైందని తాపీగా అడుగుతున్నారా! మీరు మాట్లాడేది సుజాత గురించి అనుకుని మారేజ్ క్యాన్సిల్ చేయమని మా నాన్నకి ఉత్తరం వ్రాశాను."

"కొంప మునిగిందే! వెంటనే మీ ఊరికి రైలెక్కరా తండ్రీ" శేఖర్ సలహా ఇచ్చాడు.

భాస్కర్ చేతిలోని ముక్కలు విసిరికొట్టి. ఎదురుగావున్న పర్సుని జేబులో కుక్కుకుని స్టేషన్‌కి పరుగుతీశాడు!

★